www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 22 ఏప్రిల్ 2023
5
పశ్చిమ గోదావరి

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పవిత్రతకు, త్యాగానికి, మత సామరస్యం, సోదర భావం చాటి చెప్పే పండుగ అని, ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని తెలిపారు. అందరి జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆకాంక్షించారు.

లారీలు పంపండి.. మహాప్రభో..!

- ఖరీఫ్ పరిస్థితులు పునరావృతం
- మారని పౌరసరఫరాల శాఖ అధికారుల తీరు
- రబీ ధాన్యం రవాణాలో రైతులకు చుక్కలు
- పూళ్ల జాతీయ రహదారిపై ఆందోళనకు దిగిన అన్నదాత
- రైతులు సొమ్ములిస్తే లారీలు పెడతామంటున్న యజమానులు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం కొనుగోలులో పౌర సరఫరాలశాఖ అధికారుల తీరు ఏమాత్రం మారలేదు. ఖరీఫ్‌లో సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకున్నామంటూ నాలుగు రోజుల క్రితం వరకూ అధికారులు ఊదరగొట్టారు. ఖరీఫ్‌లో లారీల సమస్యతో రైతులు ఏవిధంగా బాధపడ్డారో మళ్లీ అదే సమస్య రబీలోనూ రైతులను వెంటాడుతున్న పరిస్థితి నెలకొంది. రెండు జిల్లాల్లోనూ మూడు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. దాదాపు 70 శాతం వరకూ మాసూళ్లు పూర్తయినట్లు రైతులు చెబుతున్న పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు, నిడమర్రు వంటి అనేక మండలాల్లో పెద్దఎత్తున రైతులు మాసూళ్లు చేసి ధాన్యం రాశులు చేసి ఉంచారు. ఆలస్యంగా గడిచిన ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. అనేక తర్జనభర్జనల తర్వాత ఎకరాకు 92 సంచుల ఇస్తున్నారు. రైతులు సంచులు తీసుకుని ధాన్యం పట్టి సిద్ధంగా ఉంచారు. ధాన్యం సంచుల్లో పట్టి ఐదు రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ ధాన్యం బస్తాలు మిల్లులకు తరలించేందుకు లారీలు మాత్రం రావడం లేదు. దీంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ముఖ్యంగా ఏలూరు జిల్లాలో పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఖరీఫ్‌లో ఎదురైన సమస్యలపై పౌరసరఫరాల శాఖాధికారులు ఏమాత్రం శ్రద్ధ పెట్టలేదని ప్రస్తుత పరిణామాలు చెబుతున్నాయి. పౌరసరఫరాల శాఖాధికారులు సరైన ప్రణాళికలు సిద్ధం చేయకపోవడమే దీనికి ప్రధాన కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. బస్తాల్లో ధాన్యం ఏవిధంగా తరలించాలో తెలీక రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కిరాయి సొమ్ము చెల్లిస్తే లారీలు పెడతామని లారీ యజమానులు చెబుతున్న పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. మిల్లుల దూరాన్ని బట్టి లారీ కిరాయి రూ.తొమ్మిది వేల నుంచి రూ.12 వేలకుపైగా అడుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అంత పెద్దమొత్తంలో కిరాయిలు చెల్లించలేక, అధికారులు లారీలు పంపించకపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో కడుపుమండిన రైతులు శుక్రవారం పూళ్ల జాతీయ రహదారిపై ఆందోళనకు దిగి లారీలు పంపించండి మహాప్రభో అంటూ వేడుకున్న పరిస్థితి నెలకొంది. తమ బాధలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలంటూ మీడియాకు లేఖ రూపంలో రైతులు తెలియజేసిన పరిస్థితి నెలకొంది. ఉంగుటూరుతోపాటు చుట్టుపక్కల మండలాలకు కేవలం 70 లారీలు మాత్రమే కేటాయించినట్లు తెలుస్తోంది. ఇవి ఏవిధంగా సరిపోతాయో తెలియక స్థానిక అధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు. పలు గ్రామాల్లో 90 శాతం మాసూళ్లు పూర్తయిన పరిస్థితి నెలకొంది. అలాంటి గ్రామాలకు కూడా శుక్రవారం ఒక్కలారీ మాత్రమే వెళ్లిన పరిస్థితి కొనసాగింది. లారీల కోసం రైతులు పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు ధాన్యం రవాణాలో ఏర్పడిన లారీల సమస్యను పరిష్కరించాలని రైతులు నెత్తినోరు మొత్తుకుంటున్నారు.

లారీలు పంపాలని పూళ్ల జాతీయ రహదారిపై ఆందోళనకు దిగిన రైతులు

ధాన్యం పట్టి ఐదు రోజులైనా లారీలు రాలేదు

వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, రైతు, పూళ్ల

రబీలో మూడెకరాల్లో వరి సాగు చేశాను. మాసూళ్లు పూర్తి చేసి పది రోజులైంది. ఈ నెల 17న సంచులు ఇచ్చారు. 40 కిలోల సంచుల్లో 300 సారలు పట్టి ఐదు రోజులు గడిచిపోయింది. ఇప్పటి వరకూ లారీలు రాలేదు. వాతావరణ పరిస్థితులు రోజుకో రకంగా ఉంటున్నాయి. ఏదైనా తేడా వస్తే తీవ్రంగా నష్టపోతాం. వెంటనే లారీలు పంపాలని కోరుతున్నాం.

పట్టిన ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది

కొరపల్లి రాంబాబు, రైతు, పూళ్ల

రబీలో 16 ఎకరాల్లో వరి సాగు చేశాను. 12 ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. ఈ నెల 17న సంచులు ఇవ్వడంతో మూడెకరాల్లో ధాన్యం పట్టాను. ఐదు రోజులు గడుస్తున్నా లారీలు రాకపోవడంతో కళ్లాల్లోనే ధాన్యం ఉండిపోయింది. లారీలు వెంటనే పంపాలని అధికారులను కోరుతున్నాం.

కిరాయి ఇస్తే లారీలు పెడతామంటున్నారు

దూడే కేశవరావు, రైతు, బొమ్మిడి

రబీలో 15 ఎకరాల్లో వరిసాగు చేశాను. ఈ నెల 16న సంచులు ఇవ్వడంతో వెయ్యి సారలు ధాన్యం పట్టాను. దాదాపు ఆరు రోజులు గడుస్తున్నా ఒక్క లారీ రాలేదు. గ్రామంలో పరిస్థితి మొత్తం ఇలానే ఉంది. రైతులు సొమ్ము చెల్లిస్తే లారీలు పెడతామని లారీ యజమానులు చెబుతున్నారు. అంత పెద్దమొత్తంలో కిరాయి చెల్లించాలంటే రైతులు నష్టపోతారు. వెంటనే లారీలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

అమెరికాలో సాయిష్ మృతితో.. ఏలూరు, పాలకొల్లులో విషాదఛాయలు

సాయిష్ తల్లిని ఓదారుస్తున్న ఎంఎల్‌ఎ ఆళ్ల నాని

వార్త మెయిన్‌లో..

కుటుంబ సభ్యులతో సాయిష్

2021లో అమెరికా వెళ్లేముందు హైదరాబాద్ ఎయిర్ పోర్టులో బంధువులు, స్నేహితులతో సాయిష్

ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

రబీ ధాన్యం కొనుగోళ్లను అధికారులు సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ రెవెన్యూ అంశాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి సమీక్షించారు. రబీ కోతలు పూర్తయిన వెంటనే కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు వస్తే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గోనె సంచుల కొరత లేకుండా ముందస్తు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో 6.40 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిల్లాలో 270 పిపిసి సెంటర్లు ప్రారంభించాల్సి ఉండగా వరి కోతలు జరుగుతున్న మండలాల్లో ఇప్పటివరకు 144 సెంటర్లను ప్రారంభించినట్లు తెలిపారు. బాయిల్డ్ రైస్ కొనుగోలుకు అనుమతించామన్నారు. ఓటర్ల జాబితా క్లైమ్‌లను వెంటనే పరిష్కరించాలన్నారు. స్పందన దరఖాస్తులను నిర్ణత సమయంలో పరిష్కరించాలన్నారు. భూ రీ సర్వే ప్రక్రియను పొరపాట్లకు తావులేకుండా సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒ దాసి రాజు, సివిల్ సప్లైస్ డిఎంటి.శివరామ ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి రామ్ సుందర్‌రెడ్డి

ప్రజా సేవకులమనే భావనుండాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజలకు సేవకులం అనే భావన ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న ప్రతి ఒక్క అధికారీ కలిగి ఉండాలని జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో 16వ జాతీయ పౌర సేవలు దినోత్సవానికి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల సమిష్టి కృషి ద్వారా ఒత్తిడిని అధిగమించి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. గుర్తింపు కోసం పని చేయకూడదని, మంచి పని చేస్తే గుర్తింపు దానంతటదే వస్తుందని తెలిపారు. అందరం సమిష్టి పనితీరు చూపడం ద్వారా జిల్లాకు మంచిపేరు వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ పౌర సేవల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నరసాపురం సబ్ కలెక్టరు ఎం.సూర్యతేజ మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు ప్రధాన కారణం అన్నారు డిఆర్‌ఒ కె.కృష్ణవేణి మాట్లాడారు. అనంతరం డిఆర్‌ఒ కృష్ణవేణి, ఆర్‌డిఒ దాసిరాజు జెసి రామ్ సుందర్‌రెడ్డిని, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఎఒ వై.దుర్గాకిషోర్, తహశీల్దార్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. సర్పంచి భూపతిరాజు వంశీకృష్ణంరాజు ఆధ్వర్యంలో కుముదవల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. సర్పంచి వంశీకృష్ణంరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు), ఎంపిటిసి ఆలిస్ మేరీ, అంగరాజు సత్తిబాబు, చేకూరి రాజా నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

5వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - తణుకురూరల్

ఎపి సీడ్స్‌లో కొత్త టెండర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు టి.రామకృష్ణ, జి.త్రిమూర్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం టెండర్ల విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఎపి సీడ్స్ వద్ద కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపి సీడ్స్‌లో టెండర్‌పై ప్రభుత్వం, అధికారుల తీరు అన్యాయమన్నారు. టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పద్ధతిలో అగ్రిమెంట్ చేయాలని, హమాలీ కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, సత్యనారాయణ, రమణ, సూరిబాబు, సాంబశివరావు పాల్గొన్నారు.

కొత్త టెండర్ విధానం చట్టవ్యతిరేకం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

50 సంవత్సరాల నుంచి ఉన్న విధానానికి భిన్నంగా టెండర్ విధానం తీసుకురావడం చట్టవ్యతిరేకమని సిఐటియు జిల్లా కమిటీ సమావేశం పేర్కొంది. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ తణుకు ఎపి సీడ్స్ అధికారులు చట్టానికి భిన్నంగా టెండర్ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. అనేక సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులను తొలగించి చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ నెల 24, 25 తేదీల్లో మండల ఆఫీసుల వద్ద ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులను విధుల్లోకి తీసుకునే వరకూ పోరాటం కొనసాగించలన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని కార్మిక చట్టాలను అమలు చేయించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్ ఈ కాలంలో జిల్లాలో జరిగిన కార్యక్రమాలను ప్రవేశపెట్టారు. మేడేను అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్, దక్షిణామూర్తి, టి.సత్యనారాయణ, జవ్వాది శ్రీను, డి.కళ్యాణి, సిహెచ్.లక్ష్మి, మదీన, నాగమణి, సూరిబాబు, ఎం.ఆంజనేయులు, రామకృష్ణ, రాణి పాల్గొన్నారు.

మతోన్మాద బిజెపిని సాగనంపాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు,

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజావ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపాలని, మోడీ నుంచి దేశాన్ని కాపాడాలని ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకూ చేపడుతున్న ప్రచారభేరి యాత్ర ముగింపు సభ శుక్రవారం పట్టణంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఎన్‌కె గ్రౌండ్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షతన జరిగింది. ఈ బహిరంగ సభకు ముఖ్య వక్తలుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, దేశ లౌకికతత్వాన్ని దెబ్బతీస్తూ అట్టడుగు వర్గాలవారిపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా పనిచేస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులివ్వకపోవడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్మకానికి పెట్టి మోడీ రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసరాలు, ఎరువులు, ఔషధాల ధరలను పెంచిందన్నారు. పట్టణ ప్రజలంతా బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, ఈ దేశం నుండి బిజెపిని, ఈ పార్టీతో జతకట్టిన పార్టీలను తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ ఢిల్లీలో మోడీ, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. ప్రపంచ జనాభాలో మొదటి స్థానంలో ఉన్న మన దేశం, ఆకలి చావుల్లో, దారిద్ర్యంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. మోడీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా జతకట్టిన పార్టీలను రాష్ట్రం, దేశం నుండి తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మోడీ దేశాన్ని, దేశ సంపదను, ప్రజలను కొల్లగొట్టి అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పుణ్యమా అని ప్రజల దగ్గర డబ్బుల్లేక, కొనుగోలు శక్తి లేక, ఆదాయాల్లేక, పనుల్లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం, ప్రతిపక్షాలైన టిడిపి, జనసేన మోడీ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించి పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అచ్ఛేదిన్ తీసుకొస్తానని ప్రచారం చేసి గద్దెనెక్కిన మోడీ ప్రభుత్వం ప్రజలకు చచ్చేదిన్ తీసుకొచ్చిందన్నారు. మోడీకి దేశాన్ని పాలించే అర్హత లేదని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కనీసం పాత్రలేని వారు దేశాన్ని పాలించడం సిగ్గుచేటన్నారు. బిజెపి ప్రజల కష్టాల గురించి పట్టించుకోకుండా కేవలం మతం పేరుతో ప్రజలను చీల్చి అధికారంలోకి వచ్చిందన్నారు. మోడీ దేశాన్ని కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్నారని విమర్శించారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను, అంబానీ, అదానీలకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలను నియంత్రిస్తాం, రైతాంగాన్ని ఆదుకుంటాం, స్వర్ణ భారతాన్ని సాధిస్తామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్ల కాలంలో దేశాన్ని అట్టడుగుస్థాయికి తీసుకెళ్లిన ఘనత మోడీదేనని తెలిపారు. కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు, కలిశెట్టి వెంకట్రావు, సిపిఎం జిల్లా నాయకులు జెఎన్‌వి గోపాలన్, కె.రాజారామ్మోహన్ రాయ్, డి.కళ్యాణి, సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సిపిఎం పెంటపాడు మండల కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు సీతారాం ప్రసాద్, సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమసుందర్, సిపిఐ జిల్లా నాయకురాలు సికిలే పుష్పకుమారి పాల్గొన్నారు.

ఆకివీడు : దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని, బిజెపిని ఓడించాలని కోరుతూ సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమం శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. వెలమపేట, తీగలు, దొడ్డి రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఈ ప్రచారం సాగింది. అధిక ధరల నుండి దేశాన్ని కాపాడాలంటే అందరూ సమైక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి కె.తవిటి నాయుడు, నాయకులు పెంకి అప్పారావు, బి.వర్మ, షేక్ వలీ, గేదెల విజయ లావణ్య, నల్ల శ్యామ్, బైరి కళ్యాణి, ఎస్‌కె.అమ్మాజీ, మువ్వా శ్రీను, జి.రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు

పేదల భూముల్లోని ఇసుక తరలింపు అన్యాయం

కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామంలో 30 ఏళ్లుగా పేదల ఆధీనంలో ఉన్న లంక భూముల్లో ఇసుకను ఇతర ప్రాంతాల్లో ఉన్న జగనన్న లే అవుట్లకు తరలించడం అన్యాయమని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తెలిపారు. లంకభూముల్లో ఇసుక తీయకూడదని ఆయా లంక భూముల లబ్ధిదారులు శుక్రవారం లంకలో చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి మాల్యాద్రి సంఘీభావం తెలిపి మాట్లాడారు. గతంలో చంద్రబాబు నాయుడు పేదల నోట్లో మట్టి కొట్టి మట్టి వ్యాపారం చేశారని, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా పేదల నోట్లో మట్టి కొట్టి పేదల భూములను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబుకు పట్టిన గతే జగన్మోహన్ రెడ్డి కూడా పడుతుందన్నారు. లంక భూముల్లో ఇసుకను తవ్వడానికి ప్రయత్నించి ప్రభుత్వ అధికారులు దళితుల పట్ల తీరని వివక్షత చూపిస్తున్నారన్నారు. ఇప్పటికైనా దళిత భూములను వదిలి పెద్దల చేతుల్లో ఉన్న భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, నాయకులు కానేటి బాలరాజు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, చెల్లిబోయిన వడ్డీకాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

లంక భూముల జోలికొస్తే ఊరుకోబోం

కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల హెచ్చరిక

మండలంలోని ఏనుగువానిలంక గ్రామ పరిధిలోని చించినాడ పేదలకు చెందిన లంక భూముల జోలికొస్తే చూస్తూ ఊరుకోబోమని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం చించినాడ లంక భూముల్లో ఇసుక తవ్వకాలు చేయకూడదని గ్రామంలోని పేదలంతా కలిసి స్థానిక లంకలో ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమాలకు సంఘీభావంగా హాజరైన క్రాంతి బాబు, జార్జి మాట్లాడుతూ పేదల భూముల్లో ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయాలని హైకోర్టు స్వయంగా స్టేఆర్డర్ ఇచ్చినప్పటికీ స్థానిక వైసిపి నాయకులు పేదలకు లంక భూములు లేకుండా చేయాలనే కక్షతో ఇక్కడి ఇసుకను ఇతర మండలాల్లోని జగనన్న లేఅవుట్ల పేరుజెప్పి పక్కదారి పట్టించి సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నం చేయడం అత్యంత దుర్మార్గపు చర్య తెలిపారు. 30 సంవత్సరాలుగా లంకభూముల్లో వివిధ రకాల పంటలు పండిస్తూ జీవనాధారం పొందుతున్న పేదలంతా కలిసి ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా, ఎన్నిసార్లు ఇసుక తవ్వకాలను అడ్డగించినా, ప్రభుత్వ అధికారుల కనుసన్నల్లో పోలీస్ బలగాలను ఉపయోగించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ఇక్కడి ఇసుకను తరలించడానికి ప్రయత్నించడం చేస్తున్నారని తెలిపారు. దీనిపై ఇప్పటికే వివిధ దళిత, బిసి సంఘాలు, ఇతర రాజకీయ పక్షాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి కార్యాచరణను రూపొందించడం జరిగిందన్నారు. ఈ భూముల జోలికొస్తే జిల్లా వ్యాప్తంగా అన్ని సంఘాల వారితో కలిసి పేదలకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు కానేటి బాలరాజు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, చెల్లుబోయిన వడ్డీకాసులు, మల్లుల పుల్లారావు, ఎస్.భాస్కరరావు, ఎం.ఆంజనేయులు, టి.స్టాలిన్, బుంగ శంకరుడు, మురాల రత్నప్రసాద్, బూసి రాజశేఖర్ పాల్గొన్నారు.

నీటి నిల్వలు దోమలకు నిలయాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నీటి నిల్వలు దోమలకు నిలయాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు అన్నారు. మండలంలోని వెంకట్రామన్నగూడెం పిహెచ్‌సి పరిధిలోని వెంకట్రామన్నగూడెం, కొండ్రుప్రోలు, ఎల్.అగ్రహారం గ్రామాల్లో జరుగుతున్న ఫీవర్ సర్వే డ్రైడే డ్రైడే కార్యక్రమాలను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత వాతావరణం వల్ల వ్యాధులు ప్రబలుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య కార్యదర్శులు సునన్య, సామాజిక ఆరోగ్య అధికారి పద్మ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఉండి

ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉండి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పంజా ధర్మతేజ అన్నారు. శుక్రవారం పెదపుల్లేరు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పంజా ధర్మతేజ మాట్లాడుతూ సరైన వైద్య సదుపాయాలు లేని గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించవచ్చన్నారు. ఉదయం సమయంలో విలేజ్ హెల్త్ క్లినిక్ వద్దకు వచ్చిన రోగులను పరీక్షించి, మధ్యాహ్నం లేవలేని వారిని పరీక్షించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిపి, షుగర్ రోగులకు పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశామన్నారు. అలాగే గర్భిణులకు పరీక్షలు చేసి మందులు ఇచ్చామన్నారు.

రైతులకు నవధాన్యాల కిట్లు అందజేత

ప్రజాశక్తి - అత్తిలి

నవధాన్యాల పంటలతో భూమికి ఆశించే చీడపీడలను తగ్గించవచ్చని తాడేపల్లిగూడెం ప్రగతి వ్యవసాయ అధికారి జి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం వరిచేడులో రైతులకు నవధాన్యాల కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నవధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వీటివల్ల వానపాములు అభివృద్ధి చెందుతాయన్నారు. అంతేకాకుండా పశువులకు గ్రాసం పచ్చి మేతగా ఉపయోగపడుతుందన్నారు. జీవవైవిధ్యం పెరుగుతుందన్నారు.

వెంకట్రామరాజుకు డాక్టరేట్

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా గత సంవత్సరం నుంచి చేస్తున్న వివిధ రకాల సేవలకు గాను డాక్టరేట్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉందని ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట్రామరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాళ్లకూరులో ట్రస్టు ద్వారా పేదలకు, పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం, చలివేంద్రాల ఏర్పాటు, మెరుగైన వైద్యం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. తన సేవలను గుర్తించిన బెంగళూరుకు చెందిన ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ తనను డాక్టరేట్‌కు ఎంపిక చేసిందన్నారు. ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ద్వారా బెంగళూరులో ఈనెల 29న అవార్డు అందుకుంటానని తెలిపారు.

ఆచంటలో చలివేంద్రం

ప్రజాశక్తి - ఆచంట

ప్రజల సౌకర్యార్థం ఆచంట కరెంట్ సెంటర్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సర్పంచి చలివేంద్రం ప్రారంభించి మాట్లాడారు. వేసవి నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్, గ్రామ అధ్యక్షులు పిచ్చెట్టి సత్యనారాయణ, ఉపసర్పంచి అడ్డాల పెద్దిరాజు, ఎంపిడిఒ జగన్నాథరావు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : మార్కెట్ అన్నపూర్ణమ్మ అన్నదాన సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ఇబ్బందిలేని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ శరత్, చెంపాక కృష్ణమూర్తి, సత్య పాల్గొన్నారు.

దళిత మహిళకు ఎంఎల్‌ఎ నిమ్మల పరామర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి ప్రభుత్వంలో దళిత మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో 10వ వార్డుకు చెందిన దళిత మహిళ మేరీని ఆయన పరామర్శించారు. వారం రోజులుగా ఆమె అగ్రవర్ణాల దాడిలో చికిత్స పొందుతున్నా ఇప్పటికి సరైన న్యాయం జరగలేదని చెప్పారు. ఆమెకు బయట నుండి మందులు కావాల్సి వస్తే తానే సమకూర్చుతానని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు తెలిపారు. పోలీసులు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జివి, పీతల శ్రీను పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

అత్తిలి : రైతులకు ధాన్యం డబ్బులు 21 రోజుల్లోపు నగదు వారి ఖాతాలో జమ చేయనున్నట్లు ఎఎంసి ఛైర్మన్ బి.భరణిప్రసాద్ అన్నారు. పాలూరు సొసైటీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం అమ్మకానికి అవసరమైన గోనెసంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి టి.దయామణి, ఎఎ రాజేష్, ఎంపిటిసి సభ్యులు ఎస్.రామలింగ విఘ్నమూర్తి, సొసైటీ ప్రెసిడెంట్ కె.శ్రీహరిరాజు, కారుమూరి సునీల్, ఈదురు, కొమ్మర, పాలూరు రైతులు పాల్గొన్నారు.

'టిడిపి గెలుపు చారిత్రక అవసరం'

ప్రజాశక్తి - పాలకోడేరు

రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు పిలుపునిచ్చారు. టిడిపి మండల అధ్యక్షుడు దెందుకూరి గాంధార్ కోటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మదపాటి రామారావు ఆధ్వర్యంలో శుక్రవారం వేంద్ర గ్రామంలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఎంఎల్‌ఎ రామరాజు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల ఇబ్బందులను ఆయన తెలుసుకున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట వేమవరం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గతంలో పూడుకుపోయిన చెరువును ఉపాధి హామీ పనుల ద్వారా పూడికతీత పనులు చేపట్టినట్లు సర్పంచి జక్కంశెట్టి చంటి తెలిపారు. ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న చెరువు పూడికతీత పనులను సర్పంచి ప్రారంభించారు.

నేరాలు.. ఘోరాలు..

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడు అరెస్టు

మొగల్తూరు : బాలిక కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడిని గురువారం రాత్రి అరెస్ట్ చేశామని ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఖండవల్లి పంచాయతీ పరిధి లంకమాలపల్లి గ్రామానికి చెందిన నల్లి జయకృష్ణ మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి రెండు సంవత్సరాల నుంచి వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆ బాలికను కుటుంబ సభ్యులు మొగల్తూరులోని నక్కవారిపాలెంలోని పెద్దనాన్న ఇంటికి సుమారు మూడు నెలల క్రితం పంపారు. ఈ నెల 9న జయకృష్ణ ఆ బాలికను ఇంటి నుండి తీసుకుని వెళ్లిపోయాడు. అక్కడ నుంచి వీరవాసరం వెళ్లగా జయకృష్ణ కిడ్నాప్ చేసి నరసాపురంలోని వారి బంధువుల ఇంటికి తీసుకెళ్లాడు. ఆ బాలిక పెద్దనాన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దిశ డిఎస్‌పి కెవి.సత్యనారాయణ దర్యాప్తు చేపట్టారు. గురువారం రాత్రి నిందితుడిని అరెస్ట్ చేశారు. శుక్రవారం కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురిపై దాడి కేసు

పాలకోడేరు : వేంద్ర గ్రామానికి చెందిన ఎస్.సాహిత్ మరో ఇద్దరు పాత గొడవలను పురస్కరించుకుని తనపై కర్రతో దాడి చేసి గాయపరిచారంటూ ఇదే గ్రామానికి చెందిన ఐ.మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తలకు గాయం కావడంతో ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నాడు. ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశం కేసు నమోదు చేసినట్లు శుక్రవారం తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 83339 88814

విస్సాకోడేరు సొసైటీ ఛైర్మన్‌గా జోషి

సభ్యులుగా బాబు, బాలాజీ నియామకం

ప్రజాశక్తి - పాలకోడేరు

వీసాకోడేరు సొసైటీ త్రిసభ్యసభ్య కమిటీ ఛైర్మన్‌గా మాజీ ఎంపిటిసి గెడ్డం జోషి నియమితులయ్యారు. అలాగే సభ్యులుగా సొసైటీ మాజీ ఛైర్మన్ సామంతపూడి మాద్రాజు (బాబు), చెబోలు బాలాజీ, మరి కొంతమంది డైరెక్టర్లుగా నియమితులయ్యారు. దీనిలో భాగంగా శుక్రవారం జోషి సొసైటీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ తనను ఛైర్మన్‌గా ఎన్నుకున్న అందరి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సొసైటీ అభివృద్ధితో పాటు రైతులకు మరిన్ని సేవలు అందజేస్తానని చెప్పారు. వైసిపిలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ ప్రతిఫలం దక్కుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ కల్పించిన రిజర్వేషన్లలో సొసైటీ ఛైర్మన్‌గా పదవి దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సొసైటీ ఛైర్మన్ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. అనంతరం సొసైటీ ఛైర్మన్ జోషి, కమిటీ సభ్యులు సామంతపూడి మాద్రాజు (బాబు)ను వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, సొసైటీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణరాజు (చంటిరాజు), విస్సాకోడేరు, పాలకోడేరు, గొరగనమూడి సర్పంచులు బొల్ల శ్రీనివాస్, ఇంజెట్టి మరియమ్మ, గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీ రాజు) మాజీ సర్పంచులు పెనుమత్స శ్రీనివాస్‌రాజు, చెల్లబోయిన పాపారావు, దుండి అశోక్ బాబు, పెద్దలు సహదేవరాజు, సొసైటీ ఛైర్మన్ జోషి, సభ్యులు బాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి కందుల నాగరాజు, ఎంపిటిసి సభ్యులు బి.గాంధీ, పి.లక్ష్మీపతి, మాజీ ఎంపిటిసి కె.శ్రీనివాస్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు చుండూరి అంజిబాబు, చందు, తుల చంద్రరావు, మండల సచివాలయాల కన్వీనర్ పాల రాధాకృష్ణ పాల్గొన్నారు.



జోషికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి) అన్నారు. శుక్రవారం రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమరాజు ఇల్లింద్రపర్రు, పెనుమంట్ర, మార్టేరు రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. ఈ సందర్భంగా పెనుమంట్రలో జరిగిన కార్యక్రమంలో వైసిపి నాయకులు గాదిరాజు సాయిరామరాజు ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసురెడ్డి మాట్లాడుతూ గత సీజన్‌లో రైతుల పడ్డ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వాటిని అధిగమించి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతు ఖాతాలో నగదు జమ చేస్తామన్నారు. తూకం విషయంలో అసత్యప్రచారం జరుగుతోందని, రైతులు నమ్మొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమరాజు ఇల్లింద్రపర్రు సర్పంచి వనుం సూర్యనారాయణ, పెనుమంట్ర ఉప సర్పంచి భూపతిరాజు వెంకటశ్రీనివాసరాజు, ఎఒ మద్దాల జయ దుర్గామాధురి, తహశీల్దార్ దండు అశోక్‌వర్మ, ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి, ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభించిన ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి)

వాలంటీర్లు బాధ్యతగా పని చేయాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వాలంటీర్లు బాధ్యతగా, సేవా భావంతో పనిచేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో నూతనంగా ఎంపికైన 42 మంది వాలంటీర్లకు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రతి ఇంటి ముంగిటకూ సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. ప్రతినెలా 1వ తేదీ తెల్లవారుజామునే పెన్షన్లను పంపిణీ చేస్తూ వాలంటీర్లు ప్రజాసేవలో నిమగ్నమయ్యారన్నారు. పట్టణంలో నూతనంగా ఎంపికైన వాలంటీర్లు చిత్త శుద్ధితో తమ బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ పాల్గొన్నారు.

పేదలకు పట్టాలు పంపిణీ..

వీరవాసరం మండలం నందమూరి గరువు గ్రామానికి చెందిన పలువురు పేదలకు ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

యువత వ్యసనాలకు దూరంగా ఉండి చదువుకు ఎక్కువ ప్రాధాన్యతివ్వాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. శుక్రవారం భీమవరంలో ఓ ప్రయివేటు హోటల్లో ఏర్పాటుచేసిన మాల మహానాడు సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర పుష్పరాజ్ మాట్లాడారు. ముందుగా భీమవరం పట్టణ అధ్యక్షులుగా చీర సాయికుమార్‌ను, జొన్నలగరువు గ్రామ కార్యదర్శులుగా దారం రాజశేఖర్, కాటిక రమేష్‌ను నియమించి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పుష్ప రాజ్ మాట్లాడుతూ ప్రస్తుతం చదువుకోవడానికి అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా అధ్యక్షులు నేతల సువర్ణ రాజు, జిల్లా కార్యదర్శి కోలాటి ప్రసాదరావు, భీమవరం నియోజవర్గ అధ్యక్షులు మానుకొండ కిరణ్ పాల్గొన్నారు.

విఆర్‌ఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

టిడిపి హయాంలో విఆర్‌ఎలకు రూ.10,500 ఇవ్వగా గత నాలుగు సంవత్సరాల వైసిపి పాలనలో ఒక్క రూపాయి పెంచకపోవడం దారుణమని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు విఆర్‌ఎ సంఘం వారు ఎంఎల్‌ఎ రామానాయుడును ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి తమ ఆవేదన చెప్పుకున్నారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ విఆర్‌ఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గూగుల్ యాప్స్‌పై వర్క్‌షాపు ప్రారంభం

ఆకివీడు : జి మెయిల్ వాడేటప్పుడు గూగుల్ సెట్టింగ్స్‌లో సెక్యూరిటీలో రెండు అంచెల ధ్రువీకరణను పాటిస్తే తమ ఇమెయిల్‌ను ఎవరూ హ్యాక్ చేయలేరని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత విద్యార్థులకు వివరించారు. ఒక వేల ఎవరైనా హ్యాక్ చేస్తుంటే, మొబైల్‌కి నోటిఫికేషన్ వస్తుందని తెలిపారు. కళాశాల విద్యార్థులకు గూగుల్ యాప్స్‌పై రెండు రోజుల వర్క్ షాపును శుక్రవారం ప్రిన్సిపల్ సుజాత ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు తమ సర్టిఫికెట్స్‌ను గూగుల్ డ్రైవ్‌లో అప్‌లోడే చేసుకుని ఎక్కడ నుంచి అయినా వాటిని ఏ సమయంలోనైనా అవసరమైనప్పుడు వాడుకోవచ్చని తెలిపారు.

దొడ్డనపూడిలో లోవోల్టేజీ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - కాళ్ల

లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలంటూ దొడ్డనపూడి గ్రామస్తులు గురువారం మండుటెండలో కాళ్ల విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు గ్రామస్తులకు సంఘీభావం తెలిపి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. శుక్రవారం రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. దొడ్డనపూడి గ్రామంలోని విద్యుత్తు లైను నిలిపివేసిన ప్రాంతాన్ని విద్యుత్ శాఖ డిఇ పీర్ అహ్మద్‌ఖాన్, ఆకివీడు ఎడిఎ రాంబాబు, కాళ్ల ఎఇ పి.రాంబాబు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. విద్యుత్తు లైన్ వేసిన ప్రాంతం ప్రభుత్వ భూమి అని రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. దీంతో 63 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు వెళ్లేస్తంభాలకు వైర్లు వేసి విద్యుత్ సరఫరా చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సోషల్ ఆడిట్‌పై శిక్షణ

ప్రజాశక్తి - కాళ్ల

ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని ఉపాధ్యాయులు తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని సమగ్ర శిక్ష ఎపిసి పి.శ్యాంసుందర్ అన్నారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని ప్రధానోపాధ్యాయులకు సోషల్ ఆడిట్ మూల్యాంకనంపై శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఎంఒ కోటేశ్వరరావు, ఎంఇఒ ఎంఎస్.శ్రీమన్నారాయణ, ఎంఇఒ ఎ.రవీంద్ర, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ బిఆర్ఎంకె.స్వామి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - అత్తిలి

పంట కోత వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని తాడేపల్లిగూడెం ప్రకృతి వ్యవసాయ శాఖ జోనల్ కోఆర్డినేటర్ జెడ్ సి రత్నాజీ అన్నారు. మండలంలోని ఎర్రనీలిగుంట గ్రామంలో వరి పంట కోత ప్రయోగం శుక్రవారం చేశారు. ఈ సందర్భంగా రత్నాజీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంతో పురుగు మందులు, ఎరువులు ఉపయోగించి పండించడంలో వ్యత్యాసం గమనించవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా వచ్చిందని తెలిపారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే దశలవారి పోరాటానికి సిద్ధంగా ఉండాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య పిలుపునిచ్చారు. ఆర్‌టిసి ఉద్యోగుల ఉమ్మడి జిల్లా వర్క్ షాప్ ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎపి ఎన్‌జిఒ హోంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసిలో ప్రయివేటీకరణ చర్యలు నిలిపి వేయాలని, ప్రయాణికుల అవసరాల కోసం కొత్త బసులు వేయాలన్నారు. అనంతరం ఆర్‌టిసి ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల ఓల్డ్ పెన్షన్‌ను వర్తింపజేయాలని, ఆర్‌టిసిలో అద్దె బస్సుల పెంపుదల ఆపాలని, ఆర్‌టిసి బస్సులు కొనుగోలు చేయాలని, ఉద్యోగులకు సంవత్సరాల తరబడి పేరుకుపోయిన బకాయిలు చెల్లించాలని వర్క్‌షాపులో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి టిపిఆర్.దొర, రాష్ట్ర కార్యదర్శి ఎం.అరుణకుమారి, జిల్లా గౌరవ అధ్యక్షులు పిఎస్.రావు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టివిఎస్.మూర్తి, ఎఎస్.రాయుడు, ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.శ్రీనివాసు, ఎన్.సురేష్, తణుకు డిపో ఎస్‌డబ్ల్యుఎఫ్ గౌరవ అధ్యక్షులు కామన మునిస్వామి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య

'పేదల సంక్షేమానికి జగన్ కృషి'

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని ములపర్రు గ్రామం పితాని వారిపాలెంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ మంత్రి, ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు.

లే అవుట్లకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - గణపవరం

ఏలూరు డెవలప్‌మెంట్ అథారిటీ అనుమతులు లేకుండా స్థానికులు ఎవరైనా స్థలాలు కొనుగోలు చేస్తే అవి చెల్లవని సరిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి డి.రామాంజనేయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉడా అనుమతి ఉంటే వారి స్థలానికి డ్రైయినేజీ, ఎలక్ట్రికల్, మంచినీరు వంటి సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ప్రశాంతంగా నగర పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి - ఆకివీడు

అజెండాల అంశాలు పెద్దగా లేకపోవడం, మరోపక్క భానుడి విష్ణు ప్రభావంతో శుక్రవారం నిర్వహించిన నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం సుమారు 40 నిమిషాల్లోనే ప్రశాంతంగా ముగిసింది. సమావేశం చైర్ పర్సన్ జామ్ హైమావతి అధ్యక్షతన నిర్వహించారు. మంచినీరు, పారిశుధ్యం అంశాలనే అజెండాగా చేపట్టారు. ఒకరిద్దరూ కౌన్సిలర్లు ప్రజా సమస్యలను లేవనెత్తినా స్వల్పంగా ముగించారు. రూ.1.85లక్షలతో కంప్యూటర్ల కొనుగోలు, ఆపరేటర్ నియామకం, మరో రూ.నాలుగు లక్షలతో మురుగు షీల్డ్‌ను బయటికి తీసే పని, పలు అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వచ్చే నెల 13వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారం నిమిత్తం తీసుకొనే చర్యలపై పోలీస్ అధికారులతో శుక్రవారం భీమవరం ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ధనరాజు, భీమవరం రూరల్, ఆకివీడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, పాలకోడేరు, ఆకివీడు, కాళ్ల, వీరవాసరం భీమవరం రూరల్ పోలీస్ ఉన్నత అధికారులు, కోర్ట్ రిప్రజెంటేటివ్‌లు పాల్గొన్నారు.

విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

రుగ్మతలతో బాధపడుతున్న వారు విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పాలకోడేరు పిహెచ్‌సి వైద్యురాలు లీలాలక్ష్మి అన్నారు. శుక్రవారం విస్సాకోడేరులో ఏర్పాటు చేసిన కుటుంబ డాక్టర్ వైద్య శిబిరంలో రోగులకు ఆమె వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఔషధాలు అందించారు. ఆరోగ్యశ్రీలో చికిత్సలు పొందిన వారి ఇళ్లకు వెళ్లి పరిస్థితిపై ఆరా తీశారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని పోడూరు గ్రామానికి చెందిన అర్హులైన 11 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను మాజీ మంత్రి, ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు శుక్రవారం తూర్పుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు లేని వారు అర్హులై ఉంటే దరఖాస్తు చేసుకుంటే అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, సర్పంచి సెట్టిబత్తుల సువర్ణరాజు, తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు, ఆర్ఐ రాంబాబు, చేకూరి సూరిబాబు పాల్గొన్నారు.

పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఏలూరు నగరం, ఎన్.టి.ఆర్.కాలనీ, కోటేశ్వర దుర్గాపురం గ్రామ కాపురస్తులైన సంబంగి జనార్ధనరావు, తండ్రి: రామ్మోహన్ అను నాకు క్రయ దస్తావేజు నెం. 2921/2019 కలవు. ఈ దస్తావేజులను జిరాక్సు నిమిత్తం ది.08-04-2023వ తేదీన ఇ.సి. తీయించుకొనుటకు మా ఇంటి వద్ద నుండి ఏలూరు రిజిస్ట్రారు ఆఫీసు వద్దకు బైక్‌పై వెళ్ళుచుండగా మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినవి. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

ఎస్.జనార్ధనరావు
సెల్: 93472 94071

పోయినవి

ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, మినీ బైపాస్ రోడ్, రామకృష్ణాపురం, H.No. 22D-2-14 కాపురస్తులు రెడ్డి నాగేశ్వరరావు గారి భార్య రెడ్డి పద్మావతి గారి పేరున ఏలూరు R.O లో R.S. No. 1017, Extent of 292 sq.yds డాక్యుమెంట్ నెంబర్ 852/1989 గా రిజిస్టర్ కాబడినది. సదరు ఆస్తి గల దస్తావేజును జిరాక్స్ కాపీల నిమిత్తము మా ఇంటి నుండి అంబికా థియేటర్ సెంటర్‌కు మా ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గమధ్యలో పడిపోయినవి. ఎంత వెతికినా కనిపించలేదు. కావున ఈ పేపర్ ప్రకటన చూసి ఎవరికైనా దొరికినచో ఈ సెల్ నెంబర్‌కు **8977809189** లేదా పైన తెలిపిన అడ్రస్‌కు అందచేయగలరు.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

ప॥గో॥జిల్లా, కాళ్ళ మండలం, కోపల్లె గ్రామ కాపురస్తులు దంతులూరి కృష్ణంరాజు, తండ్రి: సీతారామరాజు యొక్క భీమవరం సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిష్టరు కాబడిన దస్తావేజు నెం. 1025/1998, తేదీ 26-03-1998, నా పేరు మీద ఉన్న ఒరిజినల్ దస్తావేజులు కోపల్లెలో మా ఇంటి దగ్గర నుండి ది.20-04-2023వ తేదీన మోటారు సైకిల్ పై జిరాక్సు నిమిత్తం వెళ్ళు చుండగా మార్గమధ్యలో పడిపోయినవి. పరిసర ప్రాంతంలో వెతికిననూ దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరు.

దంతులూరి కృష్ణంరాజు
డో.నెం. 4-5, కోపల్లె, కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా. సెల్: 77318 52349

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో వారం రోజులపాటు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర కృష్ణబలిజ సాధికారిక కమిటీ సభ్యులు గంటా త్రిమూర్తులు, తెలుగు యువత సభ్యులు మద్దుల రాము, ప్రముఖ పారిశ్రామిక వేత్త మెంటే వంశీ అన్నారు. శుక్రవారం భీమవరం లూథరన్ హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎన్‌టిఆర్ మెమోరియల్ క్రికెట్ పోటీలను వారు తిలకించి మాట్లాడారు. ముందుగా వీరవాసరం - సిసలి జట్ల టాస్ వేసి క్రీడాకారులను అభినందించారు. నిర్వాహకులు మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి 16 జట్లు వచ్చాయని, ఆదివారం ఫైనల్స్ జరుగుతాయని తెలిపారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మైలబత్తుల ఐజాక్‌బాబు, చెల్లబోయిన గోవింద్, కవూరు పృథ్వీ శంకర్, ముచ్చకర్ల సుబ్బారావు, శివ, లంకి చిన్ని, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

'టిడిపికి ప్రజాదరణ'

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజలందరూ టిడిపి వైపు మొగ్గు చూపుతున్నారని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని వారతిప్పలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రజల సమస్యలు తెలిసిన ప్రభుత్వం ఒక్క తెదేపా ప్రభుత్వమేనని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, కొల్లాటి బాలకృష్ణ, మూలస్వామి, పెంటయ్య పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు పశ్చిమ గోదావరి జిల్లా, వెంకట్రామన్న గూడెం గ్రామ కాపురస్తులు **శ్రీపతి వెంకట భవాని ప్రసాద్ గారి భార్య శ్రీపతి శిల్ప కళ అనే జుజ్జవరపు శిల్ప కళ** నాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా..,

నా క్లయింటుకు వెంకట్రామన్న గూడెం గ్రామంలో ఆర్.ఎస్.నెం. 125/6 గల య.4-40 సెంట్లు భూమికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు నెం. 2309/2003 నా క్లయింటు జిరాక్సు తీయించుటకు బ్యాగులో పెట్టుకుని జిరాక్సు షాపు దగ్గరికి వెళ్ళి చూసే సరికి సదరు ఒరిజినల్ దస్తావేజులు ఎక్కడో పడిపోయినవి. కావున యావన్మందికి బహిరంగంగా తెలియజేయునది ఏమనగా ఎవరికైనా సదరు దస్తావేజులు దొరికిన ఎడల వాటిని ఈ క్రింది అడ్రసుకు అందచేయవలనని అటులకాక ఎవరైనా వాటిని అక్రమార్జన కోసం దుర్వినియోగ పర్చిన అవి చట్టప్రకారం చెల్లనేరవని మరియు చట్టప్రకారం శిక్షార్హులు అగుదురు అని తెలియజేయడమైనది.

మీసాల రామకృష్ణ, న్యాయవాది,
తాడేపల్లిగూడెం. సెల్: 80084 33415

పోయినవి

తెలంగాణ రాష్ట్రము, వరంగల్ జిల్లా, వడ్డేపల్లి గ్రామం హౌస్ నెంబర్ 2-9-395, స్నేహ నగర్ కాపురస్తులు **రాచిరాజు రామమోహన్‌రావు గారి భార్య రాచిరాజు నళిని** గారి పేరున ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, గవరవరం గ్రామంలో **R.S. No. 40/2, Plot No. 81** ఇళ్ల స్థలం ఆమె భర్త నుండి ఆమె 2021 సంవత్సరం వట్లూరు సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో 240/2021 డాక్యుమెంట్ నెంబర్‌గా రిజిస్టర్ పొందినది. సదరు దస్తావేజునకు లింకు దస్తావేజుగా ఆమె భర్త పేరున (రాచిరాజు రామమోహన్‌రావు) డాక్యుమెంట్ నెంబర్ 5321/1984 ఏలూరు ఆర్.ఓ.లో రిజిస్టర్ కాబడినది. సదరు 2021 సంవత్సరంలో నా పేరున రిజిస్టర్ కాబడిన ఆస్తిని కొలతలు కొలిపించే ప్రక్రియ నిమిత్తం లింక్ దస్తావేజుని జిరాక్స్ తీయపించి సెయింట్ థెరిసా డిగ్రీ కాలేజ్ నుంచి గవరవరంకు ఆటోలో తిరిగి వస్తుండగా నా ఆస్తికి లింక్ దస్తావేజు అయిన **డాక్యుమెంట్ నెంబర్ 5321/1984** ఏలూరు ఆర్.ఓ మిస్ అయినది. ఎంత వెతికిన దొరకలేదు. కావున ఈ ప్రకటన చూసిన వారికి ఎవరికయినా దొరికినచో మా సెల్ నెంబర్‌కు తెలుపగలరు.

సెల్: 9849388946

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE :: ELURU
E.P.NO. 89/2018
O.S.NO. 376/2015

Between:
Cheekati Vara Prasad
...Decree Holder
VS
Kalneedi Venkateswara Rao
...Judgement Debtor

AUCTION PUBLICATION

WHEREAS the DHR obtained money decree against the JDR above named and brought the below mentioned schedule property to sale in the above Execution proceedings.

WHEREAS the Honorable Principal Senior Civil Judge, Eluru fixed the date **i.e. 04-05-2023 for the sale of the schedule property by public auction in the Court,** by ordering publication of the sale for notice to the intending bidders in order to participate in the auction.

TAKE NOTICE that the persons who intends to participate in the auction for purchase of the schedule mentioned property can appear before the Honorable Court on 04-5-2023 at 10.30 A.M. onwards and participate in the auction.

SCHEDULE

All the part and parcel of the Landed property situated in Yepugunta Village of T.Narasapuram Mandal, Chintalapudi Sub-Registry, in R.S.No.166 in an extent of Ac.2-57 cents out of Ac.7-29 cents bounded by:
East: Landed property Kalneedi Subba Rao.
South: Landed property belongs to Lavankuala Gangadhara Rao.
West: Road. ***North:*** Landed property belongs Kurasam Venkateswara Rao.

Within the above boundaries an extent of Ac.2-57 cents out of Ac.7-29 cents with all easementry rights.

DHR Value: Rs.5,00,000/-
Amin Value: Rs.30,06,000/-
J.D.R. Value Not Stated.

DEVULAPALLI SREE RAM
D.KRISHNA SASTRY
Advocates for DHR
Eluru, Eluru Dist.

Eluru,
20-04-2023.